



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 10-01-2024 సంపుటి: 06 సంచిక: 122 పేజీలు: 8 వెల: రూ 3-00

# ఏపీ సీఎం జగన్ కీలక నిర్ణయం..

## రాజ్యసభకు వైవీ సుబ్బారెడ్డి సహా ముగ్గురి ఎంపిక ?

అమరావతి ఏపీలో రాజకీయాలు వేడెక్కిస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో వైసీపీ అధినేత, ఏపీ సీఎం జగన్ పావులు కదుపుతున్నారు. సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే టికెట్లను కూడా ప్రకటించేస్తున్నారు. చాలామంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి టికెట్లు ఇవ్వడం లేదు. దీంతో టికెట్ దొరకని ఆశావహులు ఇతర పోస్టులపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలోనే రాజ్యసభ ఎన్నికలు కూడా దగ్గరికొస్తుండటంతో ఎవరికి సీటు దక్కుతుందా? అని అంతా ఆసక్తి చూపిస్తున్నారు. ఇక జగన్ కూడా ఎవరినీ నొప్పించుకుండా.. సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకుని సీట్లు కేటాయించేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే జగన్ ముగ్గురి పేర్లను ఖరారు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు (ఎస్సీ), జంగాలపల్లి శ్రీనివాస్(బలిజ)లను రాజ్యసభకు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఏప్రిల్‌లో 55 మంది రాజ్యసభ సభ్యులు పదవీవిరమణ చేయనున్నారు. వారిలో ఏపీ నుంచి ముగ్గురు సభ్యులు ఉన్నారు. వైసీపీ నుంచి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నుంచి కనకమేడల రవీంద్రబాబు, బీజేపీ నుంచి సీఎం రమేశ్‌బాబు పదవీకాలం



ఏప్రిల్‌లో అయిపోతుంది. ఏప్రిల్ 2వ తేదీన వీరు పదవీవిరమణ చేయనున్నారు. ఈ స్థానాల భర్తీకి మార్చిలోనే ఎన్నికలు జరగనున్నాయి. మెజారిటీ పరంగా ఈ మూడు స్థానాలు వైసీపీకే దక్కనున్నాయి. దీంతో అభ్యర్థుల ఎంపికకై కసరత్తు చేసిన వైసీపీ.. ముగ్గుర్ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు సమాచారం. దీంతో వేమిరెడ్డి స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన వైవీ సుబ్బారెడ్డిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇక మిగిలిన రెండు రాజ్యసభ స్థానాల్లో ఒక స్థానానికి ఎస్సీ వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని జగన్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే గొల్ల బాబురావును ఎంపిక చేశారని సమాచారం. అలాగే బలిజ సామాజిక వర్గం నుంచి జంగాలపల్లి శ్రీనివాస్‌కు ఛాన్స్ ఇవ్వనున్నారు. ఈ మూడు స్థానాల అభ్యర్థుల ఎంపికతో రాజ్యసభలో వైసీపీ బలం 11కు చేరనుంది.

# ఆ చరిత్ర మళ్లీ రిపీట్ కావాలి..

## ఎన్టీఆర్‌పై సెన్సేషనల్ ట్వీట్ చేసిన చంద్రబాబు

అమరావతి సీనియర్ ఎన్టీఆర్‌ను టీడీపీ అధినేత చంద్రబాబు స్మరించుకున్నారు. తెలుగోడి సత్తా చాటుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నందమూరి తారకరామారావు ఎన్నికై 40 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఆయన్ను గుర్తు చేసుకున్నారు. 1983లో ఇదే రోజు ఎన్టీఆర్ ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటారని చంద్రబాబు అన్నారు. దేశంలోనే మొదటిసారిగా సంక్షేమ పాలనకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని.. మళ్లీ చరిత్ర పునరావృతం కావాలని ఆకాంక్షించారు. విధ్వంసకర పాలకుల పీడ నుంచి తెలుగుజాతి విముక్తి పొంది ప్రపంచంలోనే అత్యున్నత స్థానాన్ని అందుకోవాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఎన్టీఆర్ స్ఫూర్తిగా ఆ మహోదయం కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఎన్టీఆర్‌ను చంద్రబాబు స్మరించుకున్నారు. కాగా, చంద్రబాబు చేసిన ట్వీట్‌పై పలువురు నెటిజన్లు మండిపడుతున్నారు. ఎన్టీఆర్



పార్టీని లాక్కొని ఆయన్నే పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఏదైతే ఉందో అది నాభూతో నా భవిష్యత్తు అని ఒకరు కామెంట్ చేయగా.. ఆయన తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు.. మరి మీరు.. ఆయన మీద చెప్పులు వేయించారని మండిపడ్డారు. వెన్నుపోటు పొడిచిన రోజున కూడా ఇలాగే ట్వీట్(ఎక్స్) చేయాలని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. 41 ఏండ్ల కాలంలో మూడు సార్లు సీఎంగా పనిచేసినా.. చరిత్ర పునరావృతం కాలేదా అని మరొకరు ప్రశ్నించారు. గతంలో ఎన్టీఆర్‌ను చంద్రబాబు చేసిన విమర్శలకు సంబంధించిన ఆర్టికల్స్‌ను కూడా ట్యాగ్ చేశారు.

## సంక్రాంతికి మరో ఆరు ప్రత్యేక రైళ్లు ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!



హైదరాబాద్,జనవరి 9 (ఆంధ్ర రేఖ. ప్రతినిధి)సంక్రాంతిపండుగ నేపథ్యం లో దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటికే ఆయా రైళ్లలో టికెట్లన్నీ బుక్‌అయ్యాయి. టికెట్ల దొరక్క చాలా మంది ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో రద్దీకి అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే మరో ఆరు ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. తిరుపతి సికింద్రాబాద్, సికింద్రాబాద్–కాకినాడ టౌన్, కాకినాడ టౌన్ తిరుపతి,తిరుపతి కాచిగూడ మధ్య ప్రత్యేక రైళు నడుస్తాయని తెలిపింది. ఈ నెల 10న తిరుపతి సికింద్రాబాద్ (07055) ప్రత్యేక రైలు నడువనున్నది. రైలు తిరుపతిలో రాత్రి 8.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. 11న సికింద్రాబాద్ –కాకినాడటౌన్ (07056) మధ్య ప్రత్యేక రైలు నడుస్తుంది. ఈ రైలు సాయంత్రం 7 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.45 గంటలకు కాకినాడలో ఉంటుంది. కాకినాడ టౌన్–సికింద్రాబాద్ (07057) మధ్య ప్రత్యేక రైలు12ననడువనుండగా..రాత్రి9 గంటలకు బయలుదేరుతుంది. సికింద్రాబాద్–కాకినాడ టౌన్ (07071) ప్రత్యేక రైలు 13న రాత్రి 9 గంటలకు, కాకినాడ టౌన్ – తిరుపతి (07072) ప్రత్యేక రైలు ఉదయం 10 గంటలకు అందుబాటులో ఉంటుంది. తిరుపతి – కాచిగూడ (02707) మధ్య ప్రత్యేక రైలు ఉదయం 5.30 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి.. అదే రోజు సాయంత్రం 5 గంటలకు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. ఆయా రైళ్లను వినియోగించుకోవాలని రైల్వేశాఖ కోరింది.

# వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం..



## పలు కంపెనీల ప్రతినిధులతో ప్రధాని మోదీ భేటీ..

ముంబై : వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. గుజరాత్ గాంధీనగర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌ను గుజరాత్ ప్రభుత్వం నిర్వహించడం ఇది 10వ సారి. మోదీ సీఎంగా ఉన్న సమయంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన వస్తువులను ప్రదర్శించారు. 34 దేశాలకు చెందిన ప్రతినిధులు, 16 సంస్థలకు చెందిన ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ట్రేడ్‌షోను ప్రతినిధులతో కలిసి ఆసక్తిగా తిలకించారు మోదీ. స్టాళ్లను పరిశీలిస్తూ.. ప్రధాని మోదీ వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. వివిధ సంస్థల సీఈవోలతో పాటు ప్రతినిధులతో మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెట్టుబడులు తదితర అంశాలపై మాట్లాడారు. పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలంగా ఉన్నట్లు ఆయా కంపెనీల ప్రతినిధులు తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమిట్ కొనసాగుతుంది. భవిష్యత్ తరాల కోసం ఎన్నో ఉత్పత్తులను వివిధ సంస్థలు తయారు చేస్తున్నాయని అన్నారు మోదీ. 2003లో గుజరాత్ గ్లోబల్ సమిట్ ప్రారంభమయ్యింది. అంతర్జాతీయ సంస్థలతో ఈ సందర్భంగా గుజరాత్ ప్రభుత్వం పలు ఒప్పందాలను చేసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కూడా ఈ గ్లోబల్ సమ్మిట్‌లో తన ఉత్పత్తులను ప్రదర్శించింది. కాగా.. గాంధీనగర్‌లో వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ ట్రేడ్ షో ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ స్మారక నాణెం, స్టాంపును విడుదల చేశారు.

## అర్జున అవార్డు అందుకున్న ఇషా సింగ్, షమి



ఆసియా క్రీడల్లో పసిడి పతకం తో మెరిసిన తెలంగాణ షూటర్ ఇషా సింగ్ భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమి ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డుఅందు కున్నారు. మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వీళ్లిద్దరూ ఈ అవార్డు స్వీకరించారు. భారత క్రీడా రంగంలో ఖేల్ రత్న అవార్డు తర్వాత రెండో అత్యు త్తన్నత అవార్డు అందుకున్న షమి తన కల నిజమైందని అన్నాడు. 'నా కల నిజమైంది. జీవితంలో చాలామందికి ఈ అవార్డు గెలవడం సాధ్యం కాదు. ఈ అవార్డుకు నన్ను నామినేట్ చేసినందుకు చాలా సంతోషంగా ఉంది' అని షమి తెలిపాడు. 2023కు గానూ 26 మంది అర్జున అవార్డు స్వీకరించారు. వీళ్లలో ఆసియా గేమ్స్‌లో పతకాలు కొల్లగొట్టిన అథ్లెట్స్ ఎక్కువ మంది ఉండడం గమనార్హం. అర్జున అవార్డు అందుకున్నది వీళ్లే ఆర్చరీ –అదితి గోపిచంద్ స్వామి, ఒజాస్ ప్రవీణ్ డియోటలే. అథ్లెటిక్స్ –పరుల్ చౌదరీ, శ్రీశంకర్ మురళి. బాక్సింగ్ – మహ్మద్ హుసాముద్దీన్. చెస్ –ఆర్ వైశాలి. క్రికెట్ – మహ్మద్ షమి. ఈక్వెస్ట్రియన్ ? అనుష్ అగర్వాల. ఈక్వెస్ట్రియన్ డ్రెస్సేజ్ ? దివ్యక్రితి సింగ్. గోల్ఫ్ –దీక్షా దగర్. హాకీ – కృష్ణన్ బహదూర్ పాఠక్, పుఖ్రంబం ఎ పవన్ కుమార్, రీతు నేగీ. ఖో ఖో – నస్రీన్. లాన్ బౌల్స్ – పింకీ షూటింగ్ – ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్.

## తమిళనాడును మరోసారి ముంచెత్తుతున్న భారీ వర్షాలు..



తమిళనాడు రాష్ట్రాన్ని మరోసారి భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. తూత్తుకుడి, కడలూరు, కోయంబత్తూరు, తంజావూరు, కాంచీపురం, దిండిగల్, విల్లుపురం, మైలాడుతురై, నాగపట్నం, వెల్లూరు, రాణిపేట్, తిరువణ్ణామలై, తిరువారూర్, కళ్లకురిచ్చి, చెంగల్‌పట్టు, కన్యాకుమారి సహా 18 జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. దీంతో పలు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. రోడ్లన్నీ వాగులను తలపిస్తున్నాయి. ఈ వర్షం కారణంగా జనజీవనం పూర్తిగా స్తంభించింది. ముఖ్యంగా తురునెల్వేళి, తూత్తుకుడి జిల్లాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో ఆ రెండు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్థమైంది. ఇక రాష్ట్ర రాజధాని చెన్నైలో రోడ్లన్నీ నదులను తలపిస్తున్నాయి.

# వైసీపీ మంత్రులది సామాజిక యాత్ర కాదు.. మోసాలయాత్ర

## ఆళ్లగడ్డ బహిరంగ సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సీఎం జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు

ఆళ్లగడ్డ (విభారె):నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ బహిరంగ సభలో టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడుమాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. వైసీపీది రాతియుగ మని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రజలపై భస్మాస్మసురుడి హస్తం పెట్టాడని మండిపడ్డారు. స్వర్ణయుగం వైపు నడుస్తారో.. రాతి యుగం వైపు నడుస్తారోఆలోచించాలని ప్రజలనుచంద్రబాబుకోరారు. నందికొట్కూరులో విత్తనాల సరఫరా యూనిట్‌ను, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్‌పార్కునుజగన్ ధ్వంసం చేశారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు."325 కోట్లతో జైన్ ఇరిగేషన్‌ను స్థాపించాను. 15 నెలల్లో ఓర్వకల్లు ఎయిర్ పోర్టును పూర్తి చేసిన ఘనత టీడీపీదే. 6 వేల కోట్లతోఓర్వకల్లులోప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్కు ఏర్పాటు చేశాను. జగన్ స్నేక్ లా కుట్టి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. రాయలసీమను రత్నాల సీమ కావాలని ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మిస్తే నిరుద్యోగం సమస్య ఉండదు. టీడీపీ అధికారంలోకి రాగానే అలగనూరును పూర్తి చేస్తాను. ఎన్ఎస్‌జీ భద్రతతో అంగళ్ల దగ్గర పర్యటిస్తుంటే నేను దాడి చేశానని నాపై కేసు పెట్టారు.



రాయలసీమకు నీరు ఇవ్వాలని ముచ్చుమర్రి లిఫ్ట్ ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశాను. సీమకు నీళ్లు ఇవ్వని జగన్ రాయలసీమ ద్రోహి. 350 టీఎంసీలు రాయలసీమకు ఇవ్వాలని నా కల. గోదావరి నీళ్లు బానకచెర్ల హెడ్ రెగ్యులేటర్ తీసుకురావాలని నా ఆలోచన. గోదావరి నీళ్లు బనకచెర్ల హెడ్ రెగ్యులేటర్ కు తీసుకొచ్చి అక్కడ నుంచి రాయలసీమకు తరలిస్తే సీమ సస్యశ్యామలం అవుతుంది. భూమి పాసు పుస్తకాలపై జగన్ బొమ్మలు. జగన్ బొమ్మల పిచ్చోడు. మీ ఆస్తికి మీరే వారసులు. కానీ జగన్ భూ రికార్డులు తారుమారు చేసి భూములు కొట్టేయాలని చూస్తున్నాడు. ఆటో మొబైల్ హబ్ గా చేయాలని చూశాను. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేస్తాను. నిరుద్యోగంలో మనం చివర్లో ఉన్నాం. మూడు నెలలు టీడీపీ జనసేన జెండాలు పట్టి జన చైతన్యం తీసుకురండి. మీ భవిష్యత్తుకు నాది గ్యారెంటీ. వైసీపీ ఎమ్మెల్యేలు దోపిడీ దొంగలుగా మారారు. జగన్ పాలనలో అన్ని వర్గాలు నాశనం అయ్యాయి." అని చంద్రబాబు విమర్శించారు."వైసీపీ మంత్రులది సామాజిక యాత్ర కాదు. మోసాలయాత్ర. బీసీ బిడ్డను పెట్రోలు పోసి తగల బెట్టారు. నంద్యాలలో అబ్దుల్ సలాం వేధింపులు తాళలేక రైల్వే ట్రాక్ పై ఆత్మహత్య చేసుకుంటే జగన్ కనీసం పరామర్శించలేదు. జగన్ పాలనలో ఎవరికి రక్షణ లేదు. సామాజిక కేటరైజేశన్ ను ప్రధాని కూడా సమర్ధించారు. జనం వదిలిన బానం ఎక్కడ తిరుగుతోంది. వైఎస్ రాజశేఖరరెడ్డి నా మిత్రుడు. గతంలో ఇద్దరు కలసి తిరిగాం. 1983లో రాజకీయ విరోధులం అయ్యాం. వైఎస్ రాజశేఖరరెడ్డి.. వివేకానంద రెడ్డి రామలక్ష్మనులుగా ఉండేవారు. సునీత తన తండ్రిని చంపారని కేసులు పెట్టారు. షర్మిల రాజ శేఖర్ రెడ్డిని చంపారని కేసులు పెట్టినా ఆశ్చర్య పోవాల్సిందే. రిలయన్స్ వాళ్లు చంపారని రిలయన్స్ ఆస్తులపై దాడులు చేయించారు. ఆ తర్వాత నన్ను విమర్శించారు. ఇప్పుడు వాళ్ళకు కర్నూలుకు పరిశ్రమలు తీసుకొచ్చి మంచి నగరంగా తీర్చుదిద్దుతా. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొచ్చే బాధ్యత నాది. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించి ఉద్యోగాలు తీసేస్తాడంట. మీరేమీ భయపడకండి. మీకు అండగా ఉంటానని భరోసా ఇస్తున్నా. పాన్యం ఎమ్మెల్యే జగన్నాధ గట్టును కొల్లగొట్టారు. నంద్యాల సండే ఎమ్మెల్యే హైవేను మార్చేసి తన భూముల ధరలు పెంచుకున్నాడు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి వెంచర్ల రెడ్డిగా మారారు డోన్ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాత సినిమాల్లో నాగభూషణం లాగా పిట్ట కథలు చెప్పి జనాన్ని మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

# సంపాదకీయం

బుధవారం 10-01-2024

## మాల్దీవులకు మోడీ మార్క్... షాక్

మోదీనా.. మజాకా.. మన టూరిజం మీద బతుకుతూ.. మాల్దీవులు ఎగిరెగిరి పడింది. చైనా అండ చూసుకుని మనపైనే తొడకొడదామని ప్రయత్నించి దెబ్బతింది. ఇప్పుడు కొట్టడానికి తొడ కాదు.. చేతిలో తడే లేకుండా పోయే ప్రమాదం ఎదురైంది. అది బతికేదే టూరిజం మీద. అలాంటిది మన ప్రధాని లక్షద్వీప్ పర్యటన విషయంలో కుప్పిగంతులు వేసి.. పిచ్చిపిచ్చి ప్రేలాపనలు చేస్తే ఇండియన్స్ ఊరుకుంటారా? ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టారు. దెబ్బకు విలవిలలాడిపోతోంది. ఎక్కడ మనవాళ్లు వాళ్ల దేశానికి రారో అని భయపడుతోంది. అయినా మాట్లాడే ముందే.. కాస్త ముందూ వెనకా చూసుకోవాలి. నోరు దాటితే ఊరు దాటుతుంది అని తెలియదా? అందుకే మాల్దీవుల పాలకుల పరిస్థితి? ఎలా ఉందంటే.. మనమో సామెత చెబుతాం చూడండి.. కుడితిలో పడ్డ ఎలుక అన్న చందంగా మారిపోయింది. అందుకే మాల్దీవులు బైకాట్ అంటూ గూగుల్ లో ట్రెండ్ అవుతోంది. ఇండియన్స్ దెబ్బ అలా ఉంటుంది మరి.మాల్దీవుల వార్షిక ఆదాయం దాదాపు రూ.29 వేల కోట్లు ఉంటుంది. ఆ చిన్న దేశానికి అది ఓకే. కానీ ఏటేటా పెరుగుతున్న సముద్రమట్టాన్ని చూసి భయపడే ఆ దేశం.. ఇప్పుడు చైనా అండ చూసుకుని మనపైనే బుసలు కొట్టడానికి ప్రయత్నించింది. ఈ మధ్య ప్రధాని నరేంద్రమోదీ.. మన కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒకటైన లక్షద్వీప్ కు వెళ్లారు. అక్కడే సముద్రపు ఒడ్డున కాసేపు కలియదిరిగారు. స్నార్కెలింగ్ కూడా చేశారు. దానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. అందుకే సాహస యాత్రను కోరుకునే వారు తమ లిస్ట్ లో లక్షద్వీప్ ను కూడా కలపుకోమని చెప్పారు. ప్రధాని స్థాయి వ్యక్తి అలా చెప్పారంటే కేవలం సరదా కోసమో, సంతోషం కోసమో కాదు.. దాని వెనుక మాస్టర్ స్ట్రాటజీ ఉంటుంది కదా. దానిని అర్థం చేసుకోని మాల్దీవుల మంత్రులు.. మోదీ పర్యటనపై పిచ్చి ప్రేలాపనలతో విరుచుకుపడ్డారుమాల్దీవుల యూత్ ఎంపవర్‌మెంట్ డిప్యూటీ మంత్రి మరియం షియునా చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆమెకు తగిన శాస్తి జరిగింది. లక్షద్వీప్ లో ప్రధాని మోదీ ఉన్న ఒక వీడియోను ఉద్దేశిస్తూ.. అనుచితంగా కామెంట్ చేశారు. దీనిపై భారత్ లో వివిధ వర్గాలు భగ్గుమన్నాయి. బాలీవుడ్ కూడా తీవ్రంగానే స్పందించింది. అక్షయకుమార్ అయితే మన దీవుల్లో పర్యటించి.. మన టూరిజాన్ని సపోర్ట్ చేద్దామని చెప్పేశారు. లక్షద్వీప్ లో మోదీ పర్యటించడం బాగుందని.. అలాంటి పర్యాటక ప్రదేశాలు మన దేశంలో ఉన్నాయంటూ సల్మాన్ అన్నారు. సెలబ్రెటీలు కూడా ఈ స్థాయిలో స్పందించేసరికీ ఒక్కసారిగా అందరి దృష్టి మాల్దీవుల మంత్రుల వ్యాఖ్యలపై పడింది. నెటిజన్లు అయితే మాల్దీవుల మంత్రుల కామెంట్స్ పై విరుచుకుపడ్డారు. తాము ఆ దేశానికి వెళ్లాలనుకుని హోటళ్లు బుక్ చేసుకున్నామని వాటిని వెంటనే క్యాన్సిల్ చేస్తున్నామని చెప్పారు.భారత్ నుంచి ఈ స్థాయిలో రెస్పాన్స్ వచ్చేసరికీ మాల్దీవుల సర్కార్ కాళ్ల కింద భూమి కంపించినట్లయింది. ఓరి నాయనో.. ఇదెక్కడ తమ కొంపముంచుతుందో అని భయపడింది. అందుకే జరిగిన తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేసింది. మరియం వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమంటూ చెప్పింది. ప్రభుత్వానికి వాటితో ఎలాంటి సంబంధం లేదంటూ ఆ మంత్రిపై సస్పెన్షన్ వేటు వేసింది. మరియంతోపాటు ఇతర మంత్రులు మల్షా షరీఫ్, మజీద్ ను సస్పెండ్ చేసింది. చేసిన తప్పును సస్పెన్షన్ ఆర్డర్ తో కడిగేయాలనుకున్నా దానికి సాధ్యం కావడం లేదు.మాల్దీవుల టూరిజాన్ని మన పర్యాటకంతో పోలుస్తూ మంత్రులు చేసిన వ్యాఖ్యలను నిజంగా ఖండించాల్సిందే. వాళ్ల దేశం వాళ్లకు గొప్ప అయితే మన దేశం మనకు చాలా చాలా గొప్ప. అందుకే మరియం షియునా వ్యాఖ్యలపై మన దేశం కూడా తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఈమధ్య మాల్దీవులు తోక జాడిస్తున్నట్టే కనిపిస్తోంది. కిందటేడాది నవంబర్ లో అక్కడ అధ్యక్ష పదవిని మొహమ్మద్ ముయిజ్జూ చేపట్టారు. అప్పటి నుంచి దాని వాయిస్ లో తేడా వచ్చింది. అప్పటివరకూ ఇండియా ఫస్ట్ నినాదం, విధానం కాస్తా మారిపోయింది. చైనాపై ప్రేమను పెంచుకుంది. మాల్దీవులు.. హిందూ మహాసముద్రంలో కాస్త వ్యూహాత్మక ప్రాంతంలో ఉంటాయి. అందుకే మనపై దాడి చేసేందుకు వీలుగా ఉంటుందని? చైనా దానికి సపోర్ట్ ఇస్తోంది. అంతే.. డ్రాగన్ అండదండలు చూసుకుని ఇప్పుడది రెచ్చిపోతోంది.మాల్దీవులతో పోలిస్తే మన లక్షద్వీప్ ఆదాయం తక్కువే ఉండొచ్చు. పర్యాటకంగా అంత అభివృద్ధి లేకపోవచ్చు. కానీ మోదీ అక్కడికి వెళ్లిన తరువాత చాలామంది గూగుల్ లో దాని గురించి వెదికారు. మాల్దీవుల రాజధాని మాలేలో ఆర్ఓ ప్లాంట్ ఫెయిలవ్వడంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఒక్క నీటి చుక్క దొరికితే చాలు అన్నంత దారుణంగా పరిస్థితి నెలకొంది. నగరం ప్రజల్లో భయాందోళనలతో నిండిపోయింది. అప్పుడు మాల్దీవులు భారత ప్రభుత్వాన్ని సహాయం కోరింది. ఆ సమయంలో విదేశాంగ మంత్రిగా సుష్మా స్వరాజ్, విదేశాంగ కార్యదర్శి జైశంకర్. ఆపదలో ఉన్నవారికి తక్షణ సాయం అందించడంలో ముందుండే వ్యక్తిగా పేరు తెచ్చుకున్న సుష్మా స్వరాజ్ మాల్దీవుల విషయంలో కూడా తక్షణ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే ప్రధాని మోడీతో మాట్లాడి మాల్దీవులకు సాయం అందేలా చూశారు.ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం మాలే నగరానికి రోజూ 100 టన్నుల తాగునీరు అవసరమవుతుంది. అక్కడికి సహాయాన్ని పంపే బాధ్యతను భారత వైమానిక దళానికి అప్పగించారు. భారత వైమానిక దళం మూడు సి-'17, మూడు ఐఎల్ -76 విమానాలను మోహరించింది. ప్యాక్ చేసిన నీటిని ఢిల్లీ నుంచి అరక్కోణం,

# జపాన్‌లో మరోసారి భారీ భూకంపం..

### హడలిపోతున్న ప్రజలు

కొత్త ఏడాది వేళ జపాన్ (ఏజీజూజీని)ను వరుస భూకంపాలు వణికించిన విషయం తెలిసిందే. ఆ భూకంపం నుంచి జపాన్ వాసులు తేరుకోక ముందే ఆ దేశంలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. సెంట్రల్ జపాన్‌లో 6.0 తీవ్రతతో మంగళవారం భూమి కంపించింది. హోన్షు కోస్ట్ తీరంలో మధ్యాహ్నం 2.29 గంటలకు ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అయితే, ఈ సారి సునామీ హెచ్చరికలేవీ జారీ చేయలేదని జపాన్ మీడియా వెల్లడించింది.కొత్త సంవత్సరం మొదటిరోజు జపాన్‌లో వరుస భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో సుమారు 200 మందికిపైనే ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు.




ఇప్పటికీ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇంతలో మరోసారి భూమి కంపించడంతో అక్కడి ప్రజలు హడలిపోతున్నారు.కాగా, కొత్త ఏడాది జపాన్‌ను వరుస ప్రమాదాలు వెంటాడిన విషయం తెలిసిందే. నూతన సంవత్సరం మొదటి రోజు సెంట్రల్ జాపాన్‌ను వరుస భూకంపాలు వణికించాయి. ఏకంగా 155 కంటే ఎక్కువ సార్లు రిక్టరు స్కేలుపై 4 కంటే ఎక్కువ తీవ్రతతో భూప్రకంపనలు నమోదయ్యాయి. నోటో ద్వీపకల్పంలో 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపం వల్ల పెను నష్టమే వాటిల్లింది. ఈ భూకంపం ఘటనలో ఇప్పటి వరకూ మృతి చెందిన వారి సంఖ్య 200 దాటింది. సుమారుగా 450 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరోవైపు ఈ ఘటనలో గల్లంతైన 211 మంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఆచూకీ లేకుండా పోయిన వారి జాడ కోసం సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నారు. సుమారు 3 వేల మందికి పైగా ఈ గాలింపు చర్యల్లో నిమగ్నమై ఉన్నట్లు జపాన్ మీడియా వెల్లడించింది.ఇక ఆ తర్వాతిరోజు రాజధాని టోక్యోలో ఓ విమానం భారీ మంటల్లో చిక్కుకుపోయింది. జపాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జేఏల్ 516 విమానం గత మంగళవారం టోక్యో ఎయిర్‌పోర్టులో అగ్ని ప్రమాదానికి గురైంది. హనేడా విమానాశ్రయం రన్‌వేపై దిగుతుండగా అక్కడే ఉన్న కోస్టు గార్డు ఎయిర్‌క్రాఫ్ట్ ను ఢీకొట్టడంతో విమానంలో మంటలు చెలరేగినట్లు సమాచారం. కొద్ది ప్రమాదం తర్వాత అక్కడ భారీగా మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో విమానం పూర్తిగా కాలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో జేఏల్ 516 విమానంలో సిబ్బంది, ప్రయాణికులు కలిపి 400 మంది ఉన్నారు. అదృష్టవశాత్తూ వారంతా సురక్షితంగా బయటపడినట్లు తెలిపింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

## ఇజ్రాయెల్-గాజా యుద్ధం: హౌతీ నేత కీలక వ్యాఖ్యలు

ఇజ్రాయెల్,జనవరి 9 ఇజ్రాయెల్-గాజా యుద్ధం కొనసాగుతోంది. గాజాలోని హమాస్ సాయుధులను అంతం చేసేవరకు తమ దాడులు ఆపమని ఇజ్రాయెల్ దళాలు తేల్చిచెబుతున్నాయి. ఈ నేపథ్యంలో యెమెన్ హౌతీ ఉద్యమ నేత మహమ్మద్ అలీ అల్ హౌతీ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇజ్రాయెల్- గాజా యుద్ధంలో తమ ప్రమేయాన్ని సమర్థించుకున్నారు. అయితే తాము పాలస్తీనాకు బహిరంగంగా ఎప్పుడూ మద్దతు తెలపలేదని అన్నారు. కానీ, పాలస్తీనియన్లు వాళ్ల పని వారు చేస్తూ వెళ్తారని చెప్పారు.మైళ్ల దూరంలో తనకు ఈ యుద్ధంలో ప్రమేయముందా



అని అడిగినప్పడూ.. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్.. నెతన్యాహుకు పొరుగువాడా?, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఒకే అంతస్తులో నివసిస్తున్నాడా? బ్రిటన్ ప్రధాని ఒకే భవనంలో ఉంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ దాడులతో తాము ఏం సాధించలేదని, అటువంటి సమయంలో అమెరికా తమని ఎందుకు వ్యతిరేక కూటమిగా భావిస్తోందని మండిపడ్డారు. ఇజ్రాయెల్ పోర్టుల్లో ఏం జరుగుతుందో వారే స్వయంగా చెబుతున్నారని అన్నారు. దీంతో తమ చర్యలు ఎంత ప్రభావితంగా ఉన్నాయో తెలుసుకోవాలన్నారు.ఎవరు ఏం చేసినా తమ ప్రాభల్యాన్ని తిరిగి పొందాలనుకుంటున్నామని అన్నారు. తమకు చట్టబద్ధత లేదని ఎవరు అన్నా పట్టించుకోమని తెలిపారు. నిజంగానే తమకు చట్టబద్ధత లేకపోతే బ్రిటన్, అమెరికా, సౌదీ అరేబియా, యుఎఇతో సహా 17 దేశాలను ఎదుర్కోలేమని స్పష్టం చేశారు. ఈ విషయంలో తమకు యెమెన్ ప్రజలే అండగా ఉంటారని తెలిపారు. అదేవిధంగా తాము ఇజ్రాయెల్ హింసాత్మక దాడులను ఎదుర్కొగలమని తెలిపారు. యెమెన్‌లోని ఇరాన్ అనుబంధ హౌతి సాయుధ గ్రూపు? నవంబర్ 19 నుంచి సుమారు 20 కంటే ఎక్కువ నౌకలపై డ్రోన్‌లు, క్షిపణులను ప్రయోగించిన విషయం తెలిసిందే. గాజాలోని పాలస్తీనియన్లకు మద్దతుగా హౌతీలు ఈ దాడులకు తెగపడుతున్నట్లు తెలుస్తోంది.

### నల్గొండ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా మన్నెం రంజిత్‌యాదవ్?

మరికొద్ది రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల నగారా మోగనుంది. పార్లమెంటులో అడుగుపెట్టడానికి తెలంగాణ రాష్ట్రము నుంచి యువత ఎక్కువగా ఆసక్తి చూపుతోంది.రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలకు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.ప్రధానంగా ఢిల్లీ పీఠం 2024 లో బీజేపీకె చెందుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్రము నుంచి తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది మంది విజయం సాధించారు. అదేవిదంగా 2019 ఎన్నికల్లో కూడా రాష్ట్రం నుంచి బీజేపీ అభ్యర్థులు నలుగురు పార్లమెంట్లో అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థులుగా పార్లమెంట్ కు పోటీచేయడానికి రాష్ట్రము నుంచి పోటీ ఎక్కువగానే కనపడుతోంది. ప్రధానంగా నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి యాదవ సామాజిక వర్గం నుంచి మన్నెం రంజిత్ యాదవ్ పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. రంజిత్ యాదవ్ ఇప్పటి నుంచే నల్ల గొండ నుంచి పావులు కదుపుతున్నారు. పార్టీలో కొత్తగ చేరినప్పటికీ, ఆయనకు హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు స్నేహపూర్వక వాతావరణం ఉంది.కాంగ్రెస్ నుంచి కుందూరు రఘువీర్ రెడ్డి...!నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి ఈసారి తప్పనిసరిగా కాంగ్రెస్ పార్టీ పక్షాన సీనియర్ నేత కుందూరు జానారెడ్డి తనయుడు.. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్ రెడ్డి పోటీ చేసే అవకాశాలు మెండుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఎందుకంటే గత రెండు మూడు ఎన్నికల నుండి మిర్యాలగూడ.. నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్న రఘువీర్ రెడ్డికి కాలం కలిసి రాకపోవడంతో పాటు రాజకీయ సమీకరణలు అనుకూలించకపోవడంతో పోటీ చేసే అవకాశం రాలేదు. అయితే ఈసారి పరిస్థితులన్నీ ఆయనకు అనుకూలంగా మారిన క్రమంలో నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచేందుకు రఘువీర్ రెడ్డి. బరాబర్ సిద్ధమై ఉన్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.



బీఆర్ఎస్ పార్టీ నుంచి డాక్టర్ తేరా చిన్నపరెడ్డి...! నాగార్జున సాగర్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త.. మాజీ శాసనమండలి సభ్యులు డాక్టర్ తేరా చిన్నపరెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలవనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఎందుకంటే గతంలోనూ నల్గొండ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన అనుభవం ఉండటంతో పాటు కుందూరు జానారెడ్డి కుటుంబంతో పోటీ అనగానే వాళ్లని ఎదుర్కొనే సత్తా... తేరా చిన్నపరెడ్డికి మాత్రమే ఉందనే రాజకీయ ఎత్తుగడలలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆ దిశగా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అట్లనే గత సాగర్ ఉప ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం తేరా చిన్నపరెడ్డి పేరును పరిశీలించడంతో పాటు ఎమ్మెల్సీ గానూ మరోసారి అవకాశం ఇవ్వకపోవడం వంటిపరిస్థితుల్లో తేరా చిన్నపరెడ్డికి ఈసారి నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇస్తుందనే చర్చ ఆ పార్టీ శ్రేణుల్లో బలంగా ఉంది. ఈయనతో పాటు ట్రైకార్ రాష్ట్ర మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

# హిట్ అండ్ రన్

### హైకోర్టును ఆశ్రయించిన షకీల్ కొడుకు

హైదరాబాద్, జనవరి 9పంజాగుట్టలో డిసెంబర్ 24న ప్రజాభవన్ ముందు కారుతో బారికేడ్లను ఢీ కొట్టిన ఘటనలో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. అర్ధరాత్రి ఫుల్లుగా మద్యం సేవించి ర్యాష్?గా కారు నడిపారు బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు సాహిల్. సాహిల్?ను తప్పించేందుకు పంజాగుట్ట పోలీసులు ప్రయత్నించారని ఆరోపణలు వచ్చాయి. ఆరోపణలపై విచారణ జరిపారు వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్. కారుతో ప్రమాదం చేసింది ఆసిఫ్?గా ఎఫ్ఐఆర్?లో పోలీసులు పేర్కొన్నారు. అయితే ఆసీఫ్?ను రిమాండ్ కు తరలించి విచారణ చేయాల్సిందిగా మొదట డీసీపీ ఆదేశించారు. అయితే ఆసిఫ్?ను రిమాండ్ చేసే తరుణంలో అతని తండ్రి పంజాగుట్ట పోలీస్ స్టేషన్?కు వచ్చి గొడవ చేశాడు. తన కుమారుడు ఆసిఫ్?కు దీంతో ఎలాంటి సంబంధం లేదని కారు ప్రమాదం చేసింది మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు సాహెల్?గా ఆరోపణలు చేశాడు. ఈ వ్యవహారం కాస్త వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్ వద్దకు వెళ్ళింది. విచారణ జరిపిన ఉన్నతాధికారులు పంజాగుట్ట సీఐ దుర్గారావుపై సస్పెన్షన్ విధించారుఇక కట్ చేస్తే 15 రోజులుగా మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు సాహిల్ అజ్ఞాతంలోనే ఉన్నాడు. ప్రమాదం జరిగిన మరుసటి రోజే ఫ్లైట్ ఎక్కి దుబాయికి పారిపోయి తన తండ్రి వద్ద ఉన్నాడు. అయితే అనూహ్యంగా హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు సాహిల్. తనకు ఈ కారు ప్రమాదంతో ఎలాంటి సంబంధము లేదని పిటీషన్?లో పేర్కొన్నాడు. పోలీసులు కావాలనే తనను ఈ కేసులో ఇరికించారని మొదట ఆసిఫ్ అనే వ్యక్తి పేరును నిందితుడిగా చేర్చి తర్వాత తన పేరును ఏ1 గా పెట్టడాన్ని తప్పుపడుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఆసిఫ్?తో పోలీసుల విచారణ సమయంలో భయభ్రాంతులకు గురిచేసి తన పేరు చెప్పించేలా ఒత్తిడి తెచ్చారని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్?లో మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు చెప్పుకొచ్చారు.ఈ ప్రమాదంలో ఎవరి ప్రాణాలు పోలేదని, కేవలం ఒక ర్యాష్ డ్రైవింగ్ కేసును పోలీసులు అదేపనిగా హైలెట్ చేసి తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనికి ప్రత్యక్ష సాక్షిగా ఉన్న కానిస్టేబుల్ వాంగ్మూలం ప్రకారం మొదట ఆసిఫ్ పేరును ఎఫ్ఐఆర్లో ఎందుకు చేర్చారని సాహిల్ పిటిషన్?లో ప్రశ్నించాడు. తనపై పోలీసులు కావాలనే ఈ కేసు నమోదు చేశారు కాబట్టి ఎఫ్ఐఆర్?ను కొట్టివేయాల్సిందిగా తెలంగాణ హైకోర్టును సాహిల్ ఆశ్రయించాడు. పిటిషన్?పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టనుంది.

## మాల్దీవుల రగడ : ప్రధాని మోదీకి శరద్ పవార్ సంఘీభావం



ముంబై : మాల్దీవుల వివాదం నేపథ్యంలో ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా నిలిచారు. ఇతర దేశం ప్రధానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మోదీ దేశ ప్రధాని అని, ఏ ఇతర దేశం నుంచి ఎలాంటి హోదాలో ఉన్న వ్యక్తైనా మన ప్రధానిపై అలాంటి వ్యాఖ్యలు చేస్తే తాము అంగీకరించబోమని అన్నారు.ప్రధాని పదవిని మనం గౌరవించాలని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై మాల్దీవుల మంత్రులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహం పెల్లుబికింది. మాల్దీవుల ప్రభుత్వం ఇప్పటికే ముగ్గురు మంత్రులు మల్షా షరీఫ్, మరియం షివునా, అబ్దులా మాజిద్‌లను సస్పెండ్ చేసింది.పలువురు భారతీయులు తమ మాల్దీవుల పర్యటనలను రద్దు చేసుకున్నారు. ఇక లక్షద్వీప్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో షూట్ అనంతరం ఆ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది.

## మేడిగడ్డ కుంగుబాటు: విజిలెన్స్ విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశం

హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విజిలెన్స్ విచారణకు తెలంగాణ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని పలు ఇరిగేషన్ కార్యాలయాల్లో విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు.జలసౌధలోని తెలంగాణ ఇరిగేషన్ శాఖ కార్యాలయానికి విజిలెన్స్ అధికారులు వెళ్లి తనిఖీ చేస్తున్నారు. ఈఎన్సీ మురళీధర్ రావు ఆఫీస్‌లో విజిలెన్స్ అధికారుల సోదాలు చేస్తున్నారు. ఆఫీసులోని రెండు, నాలుగు అంతస్తుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు నిర్వహించారు.హైదరాబాద్‌తో పాటు జిల్లా ఇరిగేషన్ కార్యాలయాల్లో పది ప్రత్యేక విజిలెన్స్ బృందాలతో తనిఖీలు చేపట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్ట్ కార్యాలయాల్లో విజిలెన్స్ అండ్ ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేస్తోంది. మహాదేవపూర్‌లోని ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో రికార్డులు, విలువైన పత్రాలను అధికారుల బృందం పరిశీలిస్తోంది. మెడిగడ్డ బ్యారేజీ, కన్నేపల్లి పంప్‌హౌజ్‌లకు సంబంధించిన కార్యాలయాల్లో అధికారుల బృందాలు తనిఖీలు చేస్తోంది.



## పలాసలో మొదలైన సంక్రాంతి సంబరాలు

శ్రీకాకుళం, శ్రీకాకుళం జిల్లా పలాస లోని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కాశీబుగ్గ సాయి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణాన్ని శోభాయమానంగా అలంకరించారు.విద్యార్థినులు వేసిన ముత్యాల ముగ్గులు రంగవల్లిలు చూపరులను కనువిందు చేశాయి. పాఠ్యాంశాలను బోధించే ఉపాధ్యాయులు తెలుగు సంస్కృతి ఉట్టి పడేలా సంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థులతో కలిసి ఆట పాటలతో సందడి చేశారు. విద్యార్థులు, ఉపాధ్యా యులుకేరింతల నడుమ బోగి మంటలు వేసి కన్నుల పండుగగా ముందస్తు సంక్రాంతి జరుపుకున్నారు.

## కొనసాగుతున్న ఎద్దుల పోటీలు

ఒంగోలు,ప్రకాశం జిల్లా దర్శి లో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్ల పోటీలు మూడవరోజు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్, వినుకొండ మాజీ ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికు మార్ మాట్లాడుతూ టీడీపీ జనసేన ఆధ్వర్యంలో ఎడ్ల పోటీలు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని, అంతరించి పోతున్న సాంస్కృతిక క్రీడలు కాపాడుకోవడం మన బాధ్యత అని తెలిపారు.జరగనున్న ఎన్ని కల్లో విజయం సాధించి జనసేన టీడీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నమన్న ఆయన వైసీపీ పని అయిపో యిందని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ జనసేన కు ఎదురు లేదని ఎద్దేవా చేశారు. వైసీపీప్రభుత్వం రైతులను మోసం చేసిందని రైతులకు సబ్సిడీ లోన్ ఇవ్వకుండా తుఫాన్ లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా దగా చేసిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుంది. ఎమ్మెల్యేలను మార్చి తనగొయ్యి తానే తొవ్వుకున్నారు. గిట్టుబాటు ధర కల్పించడం కోసం రైతులకు ఆదుకోవడానికి ప్రభుత్వం ఇవ్వవలసిన రైతు సంక్షేమ నిధికి 3000 కోట్లు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం వైసీపీ ప్రభుత్వం లో రైతులకు కనీసం టార్పాలిన్ పట్టాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు.

### అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్నరైతులు

అమరావతి అమరావతి రాజధాని ప్రాంతంలో మట్టి దొంగలు మరోసారి రెచ్చిపోయారు. మంగళవారం తెల్లవారుజామున తుళ్లూరు మండలం వెంకటపాలెం లో రైతులకు ఇచ్చిన ప్లాట్లలో అక్రమంగా మట్టి తవ్వుతుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. గత రెండు రోజులుగా వెంకటపాలెం కి చెందిన నలుగురు రైతుల ప్లాట్లలో మట్టితవుతున్నారు. ఉద్దండరాయన పాలానికి చెందిన కొంతమంది వ్యక్తులు మట్టి తరలిస్తున్నారని రైతుల ఆరోపించారు. మంగళవారం తెల్లవారుజామున మట్టితోవుతున్న వారిని రైతులు పట్టుకోగా తాడేపల్లి నుంచి వచ్చామని చెప్పడంతో రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు పోలీసులు వెంకట పాలానికి వచ్చి జెసిబి, టిప్పర్ను స్వాధీనం చేసుకున్నారు. కేసులు గట్టి చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరించారు.

# కోడి పందాలకు అంతా సిద్ధం



ఏలూరు, జనవరి 9, తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పెద్ద పండుగ. ముఖ్యంగా ఏపీలోని గోదావరి జిల్లాలు, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకుతాయి. కోళ్ల పందాలు, ఎడ్ల పందాలు, రంగుల హరివిల్లులతో గ్రామగ్రామాన సంబరాలు కన్నుల పండుగగా జరుగుతాయి. సంక్రాంతి వేడుకల్లో కోడి పందాలకు ఓ ప్రత్యేకత ఉంది. సంక్రాంతి మూడు రోజులు ఏపీలోని చాలా జిల్లాల్లో భారీగా కోడి పందాలు నిర్వహిస్తారు. ఈ పందాల్లో వందల కోట్లు చేతులు మారతాయి. సంక్రాంతి రోజుల్లో నిర్వహించే పందాలకు ఏడాది ముందు నుంచే కోడి పుంజులను సిద్ధం చేస్తారు. గోదావరి జిల్లాల్లో రకరకాల పేర్లతో పిలిచే కోడిపుంజులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తుంటారు. బరిలో పోటీ పడే కోళ్లకు ప్రత్యేక ఆహారం కూడా పెడతారు. కోడి పందాల నిర్వహణ చట్టరీత్యా నేరమని పోలీసుల ప్రకటన, అనధికార అనుమతులు ఏటా జరిగే తంతులో భాగమే.కత్తి కట్టి బరిలో దించేందుకు కోడి పుంజులను రెడీ చేస్తున్నారు. నెమలి, పర్లా, డేగ, కాకి డేగ, కేతువా రంగును బట్టి వివిధ పేర్లతో కోడిపుంజులను పిలుస్తారు. ఈ పుంజులకు బాదం, పిస్తాతో పాటు మాంసం కూడా ఆహారంగా పెడతారు. ఈ పందాల్లో దేశవాళీ పుంజులకు మంచి గిరాకీ ఉంటుంది. సంక్రాంతి పండుగ సమయాల్లో ఈ కోళ్లు లక్షల ధరకు కొనుగోలు చేసి పందాలు వేస్తుంటారు. అయితే ఈ ఏడాది విదేశీ పుంజులు సైతం బరిలో దిగేందుకు కాలుదువ్వుతున్నాయి. విదేశీ జాతులైన పెరు కోడిపుంజులను బరిలో దించేందుకు పందెంరాయుళ్లు సిద్ధమయ్యారు. పెరు జాతి పుంజులు దేశవాళీ పుంజుల కన్నా తక్కువ ఎత్తులో ఉంటాయి. కానీ వేగంలో పెరు జాతి దూసుకుపోతుంది. ప్రత్యర్థి పుంజు దెబ్బకు దొరక్కుండా పోరాడుతుంది. అందుకు ఈసారి పందెంరాయుళ్లు విదేశీ పుంజుల వైపు మొగ్గుచూపుతున్నారు. జనవరి నెల మొదటి నుంచే సంక్రాంతి కోళ్ల పందాలకు బరులు సిద్ధం చేస్తుంటారు. వందల ఎకరాల్లో బరులు గీస్తూ సకల సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నారు. కోడి పందాల బరి, చుట్టూ వీక్షించేందుకు స్టేజీలు, పార్కింగ్ ఏర్పాట్లు, ఫుడ్ స్టాల్స్, ఇలా సకల హంగులు సిద్ధం చేస్తారు. ఇక బరిలో దిగే కోడి పుంజుల ధరలు ప్రస్తుతం రూ.5 లక్షల వరకూ పలుకుతున్నాయి. పండుగ దగ్గర్లో వీటి ధర మరింత పెరిగే అవకాశం ఉంది. లక్షలు పెట్టి కోడి పుంజులు కొని కోట్లలో పందాలు వేయడం గోదావరి జిల్లాల్లో చూస్తుంటాం. కోడి పందాలు చూసేందుకు సినీ, రాజకీయ ప్రముఖులు గోదావరి జిల్లాలకు క్యూ కడతారు.సంక్రాంతి సీజన్ లో పుంజులకు దెరాణిఖెత్ అనే వైరల్ వ్యాధి సోకి వాటిని బలహీనపరిచింది. దీంతో పెంపకందారుల్లో ఆందోళన చెందుతున్నారు. కోడిపుంజులు బలహీనపడకుండా...తెగుళ్ల నుంచి కోలుకునేందుకు వయాగ్రా, షిలాజిత్, విటమిన్ల కాక్టెయిల్‌తో కూడిన ఆహారం అందిస్తున్నారు. వీటితో కోడిపుంజులు తాత్కాలికంగా బలంగా తయారవుతాయి కానీ భవిష్యత్తులో హాని తప్పదని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి వాటిని మనుషులు తింటే వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయని అంటున్నారు.

# మొదలైన సంక్రాంతి సందడి...





కాకినాడ, జనవరి 9, గోదావరి జిల్లాలో సంక్రాంతి సంబరాలు వారం రోజుల ముందే రంగ రంగ వైభవంగా జరిగాయి. విద్యాసంస్థల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి వేడుకలు అంబరానంటాయి. విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తులు ధరించి ముగ్గులు, గొబ్బెమ్మలు, రంగవల్లులు, ఆటపాటలతో నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. హిందువుల పండగల్లో సంక్రాంతి పెద్ద పండగ. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ముఖ్యంగా సంక్రాంతి పండగ అంటే ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ, గోదావరి జిల్లాలు గుర్తుకొస్తాయి. దాదాపు నెల రోజుల ముందే సంక్రాంతి పండగ సందడి మొదలవుతుంది. ముంగిట ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు హడావిడీ పండగ సందడిని ప్రతి ఒక్క ఇంటికి తీసుకొస్తుంది. అలాంటి వాతావరణాన్ని రాజానగరం మండలం రాజానగరం లోని ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థినిలు సంప్రదాయ పద్ధతిలో వస్త్రాలు ధరించి నృత్యాలతో అలరించారు. భోగి మంటలు, గంగిరెద్దులు, ముగ్గులు, బొమ్మల కొలువు, కోడి పందాలు, గాలిపటాలు మొదలైన సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి కాలేజీ చైర్మన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆనందం వ్యక్తం చేశారు. ఆడపిల్లలతో కలిసి సరదాగా సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. పసందైన పిండి వంటలతో సంక్రాంతి ముందే వచ్చేసిందా అన్న వాతావరణం అందరినీ ఆకట్టుకుంది.కళాశాలలో ఉన్న విద్యార్థులంతా పట్టు పరికిణీలు, లంగా ఓణీలతో తెలుగుదనం ఉట్టిపడేలా వరిచేల మధ్యలో నుంచి సంక్రాంతి పాటలకు అలరిస్తూ గోదావరి అందాలు సోయగాలతో సందడి చేశారు. ఎప్పుడూ చదువులో మునిగిపోయే మాకు సంక్రాంతి పండుగ వాతావరణంలో ఇలా ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు కళాశాల విద్యార్థినిలు. సంక్రాంతి, భోగి, కనుమ అంటే ఏంటి అనే అంశాలను చక్కగా వివరించారు విద్యార్థులు. సంక్రాంతి పాటలకు నృత్యాలు చేస్తూ అలరించారు. కాలేజీ ప్రాంగణమంతా సంక్రాంతి వైభవంతో కళకళలాడింది. సంక్రాంతి అప్పుడే వచ్చేసిందా అన్న వాతావరణం ఉట్టిపడేలా పిండి వంటలతో రుచులు చూపించి మేము చేయగలం మా అమ్మ నాన్న తాతలే కాదు అని నిరూపించారు ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థినిలు. సెలవులకి ఇంటికి వెళ్లి తినడం తప్ప ఇన్ని రకాల వెరైటీ స్వీట్స్ తయారు చేయడం ఇదే మొదటిసారి అంటున్నారు విద్యార్థులు. ఇప్పుడున్న జనరేషన్లో పిజ్జాలు, బర్గర్లు, స్వీట్ షాపుల్లో స్వీట్లు తినే యువతకు ఒక సందేశం ఇచ్చేలా ఇన్ని రకాల సంక్రాంతి స్పెషల్ స్వీట్స్ , పిండి వంటలు తయారు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాలేజీ యాజమాన్యం మాకు చదువుతోపాటు గోదావరి జిల్లాలో అనురాగాలు, ఆప్యాయతలను కూడా నేర్పుతుందన్నారు.సంక్రాంతి అంటేనే కోనసీమ అంటారు. అలాంటి కోనసీమ వాతావరణం మొత్తాన్ని కొన్ని రోజుల ముందే కొలువు తీర్చారు. గంగిరెద్దులు హరిదాసు కీర్తనలు, భోగిమంటల మధ్య మహిళా విద్యార్థులు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. భోగి మంటలు వెలిగించి సంక్రాంతి పాటలకు నృత్యాలు చేశారు. పల్లె వాతావరణం, సంక్రాంతి శోభ మధ్య విద్యార్థినులు సందడి చేశారు. భోగిమంటల చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. ఒకే వేదికపై సంక్రాంతి పాటలకు 3,000 మంది విద్యార్థులు ఒకేసారి నృత్యాలు చేసి అలరించారు. ఇన్ని వేల మంది విద్యార్థులు ఇలా సంక్రాంతి సంబరాలు చేసుకోవడం పూర్వజన్మ సుకృతం అన్నారు విద్యార్థినులు. ఇంటికి వెళితే కేవలం కుటుంబ సభ్యులతో మాత్రమే ఉంటాము. కానీ కళాశాల ప్రాంగణంలో వేలమంది ఒకే తాటిపైకి చేరి సంబరాలు చేసుకోవడం పట్ల చాలా ఆనందం వ్యక్తం చేశారు.

# బెజవాడ ఎంపీపై త్రిముఖ పోరు

విజయవాడ, జనవరి 9,ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు తోడు పార్లమెంటు సార్వత్రిక ఎన్నికలు కూడా ఉండటంతో ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించాయి. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల్లో విజయం దిశగా అడుగులు వేస్తుంది. ఇప్పటికే ఆంధ్ర రాష్ట్ర రాజధాని అయిన విజయవాడ లోక్ సభ స్థానం కోసం తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలతో బలపడుతుందగా, కాంగ్రెస్ పార్టీ సైతం విజయవాడ లోక్ సభపై కన్నేసింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారసురాలు వైఎస్ షర్మిల రాకతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఏపీలో పూర్వ వైభవం సాధిస్తామని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తోంది. పార్టీ విజయం సాదించాలని చూస్తుంది. ఇక ఈ సారి విజయవాడ లోక్ సభ స్థానం పైన ఆసక్తి కనిపిస్తోంది. టీడీపీ నుంచి ముగ్గురు పేర్లు రేసులో ఉన్నాయి. వైసీపీ నుంచి గతంలో పోటీ చేసిన అభ్యర్థి కూడా టీడీపీ ఆశావాహుల జాబితాలో చేరిపోయారు. వైసీపీ కొత్త లెక్కలు తెర మీదకు తెస్తోంది. దీంతో, కీలకమైన విజయవాడ లోక్ సభలో బరిలో నిలచేదెవరనేది ఉత్కంఠ పెంచుతోంది.బెజవాడ రాజకీయాలు ఎప్పుడూ యుద్ధ వాతావరణాన్నే తలపిస్తుంటాయి. రాజకీయం పుట్టిందే విజయవాడలోనా అన్నట్లు ఉంటాయి. మలుపుల మీద మలుపు, షాకుల మీద షాకులు ఉండేదే విజయవాడ రాజకీయం. అధికార పక్షం, విపక్షం అని రాజకీయం ఎక్కడైనా రెండువైపుల ఉంటుంది. బెజవాడలో అలాంటి లెక్కలు ఉండవు. అలాంటి విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే.. రాజకీయం రగులుతోంది. వైసీపీ, టీడీపీ మధ్య చిన్నపాటి యుద్ధమే కనిపిస్తోంది. ఇక సందిట్లో సడేమియాలా దూసుకు వస్తోంది కాంగ్రెస్ పార్టీ.మారిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీలో పోటీ పెరుగుతోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీతో నడుస్తున్న నేతలు పార్టీ టికెట్ రేసులో ముందున్నారు. ప్రధానంగా కాపు వర్గానికి చెందిన నరహరిశెట్టి నరసింహారావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రజలకు దగ్గర ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్న పేరుంది. కార్మికుల వెంట ఉండే సీనియర్ నాయకులు, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున విజయవాడ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేసి,15వేల ఓట్ల తేడాతో వైసీపీ పార్టీ చెందిన పీవీపీ వర ప్రసాద్ చేతిలో ఓడిపోయారు. ఇక ఈసారి కూడా తనకే టికెట్ దక్కుతుందన్న విశ్వాసంతో ఉన్నారు. ఇక ప్రముఖంగా వినిపిస్తున్న మరో పేరు కమ్మ వర్గానికి చెందిన సుంకర పద్మ శ్రీ. ఏపీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యహరిస్తూ కార్మికుడి కష్టాన్ని గుర్తించి ప్రజల వెంట ఉంటున్నారు. రాజధాని రైతులకు తోడుగా, అంగన్వాడీ, మున్సిపల్ కార్మిక సంఘాల సమ్మెలలో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రజల అభిమానాన్ని చూరగొన్న మహిళా సీనియర్ నాయకురాలుగా పేరు సంపాదించారు. ఈ సారి పార్లమెంటు ఎన్నికల్లో తనకే టికెట్ దక్కుతుందన్న ధీమాతో ఉన్నారు పద్మశ్రీ.గత 15 సంవత్సరాలుగా విజయవాడ లోక్ సభ స్థానాన్ని కమ్మ వర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు భర్తీ చేస్తున్నారు. అయితే, విజయవాడ రాజకీయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కూడా అదే బాటలో నడుస్తుందా అన్న చర్చ మొదలవుతోంది. వచ్చే లోక్ సభ స్థానానికి కమ్మ వర్గానికి చెందిన సుంకర పద్మ శ్రీను నిలపెడతారా..? లేదంటే అధిక ఓటర్లు కలిగిన కాపు వర్గానికి చెందిన సీనియర్ నాయకులు నరహరిశెట్టి నరసింహారావుకు టికెట్ కేటాయిస్తారా..? కాంగ్రెస్ అధిష్టానం చూపు ఎవరి వైపు..? అన్నదీ ఆసక్తికరంగా మారింది.

## వేటుకు వేళాయెరా...

విజయవాడ, జనవరి 9,పార్టీని ధిక్కరించిన వారిని ఉపేక్షించకూడదని వైసీపీ నిర్ణయించుకుంది. చర్యలు తీసుకోవడం లేదన్న కారణంగా ఫిరాయింపులు ఎక్కువ అవుతూండటంతో అనర్హతా వేటు వేస్తామని అందులో సందేహం లేదని సంకేతాలు పంపాలనుకుంటున్నారు. ఇందులో భాగంగా గతంలో పార్టీకి దూరం అయిన నలుగురు ఎమ్మెల్యేలు, ఇటీవల పార్టీకి గుడ్ బై చెప్పిన ఇద్దరు ఎమ్మెల్సీలపై అనర్హతా వేటు వేయాలని స్పీకర్, మండలి చైర్మన్‌లకు ఫిర్యాదు చేశారు. ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు రూరల్ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవి గతంలో పార్టీని ధిక్కరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారు పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటేశారని సజ్జల ఆరోపించారు. అప్పట్లో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రకటించారు. కనీ అప్పట్లో అనర్హతా వేట వేయలేదు. అప్పట్లో అనర్హతా వేటు వేస్తే ఉపఎన్నికలు వస్తాయనో.. లేకపోతే సాంకేతికంగా అనర్హతా వేటు చెల్లదన్న అనుమానం కారణంగానో లైట్ తీసుకున్నారని చెబుతున్నారు. ఇప్పుడు ఆ నలుగురిపై అనర్హతా వేటు వేయలని స్పీకర్ కు ఫిర్యాదు చేశారు. అయితే ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హతా వేట వేయాలంటే.. స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. ఆ నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేలపై వేటు వేయలేరన్న అభిప్రాయం ఉంది. అదే సమయంలో ఈ నలుగురిపైనే ఎందుకని.. టీడీపీ నుంచి వైసీపీలో చేరిన నలుగురు ఎమ్మెల్యేలు నేరుగా వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారని చెబుతున్నారు. మరి వారిపై ఎందుకు అనర్హతా వేటు వేయరని ప్రశ్నలు వస్తాయి. అయితే ఇప్పుడు ఆ నలుగురి గురించి పక్కన పెట్టి.. వైసీపీని ధిక్కరించిన వారిపైనే అనర్హతా వేటుకు సిఫారసు చేసినట్లుగా తెలుస్తోంది. ఇటీవల ఇద్దరు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయించారు. శాసనసభ్యులు కోటాలో ఎన్నికయిన వంశీకృష్ణ యాదవ్ తో పాటు సి. రామచంద్రయ్య కూడా పార్టీని వీడారు. ఒకరు జనసేనలో మరొకరు.. టీడీపీలో చేరిపోయారు. వారికి తలా మూడేళ్ల వరకూ పదవి కాలం ఉంది. వీరిపైనా అనర్హతా వేటు వేయాలని మండలి చైర్మన్ కు వైసీపీ ఫిర్యాదు చేసింది. ఎమ్మెల్యేపై అనర్హతా వేటు వేసినా ..వేయకపోయినా ఒకటే. ఎందుకంటే.. మరో నెలన్నర రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది కాబట్టి.. ఆ ఎమ్మెల్యేలకు పోయేదేమీ ఉండదు. అయితే ఎమ్మెల్సీలపై అనర్హతా వేటు వేస్తే ఉపఎన్నికలు వస్తాయి. అవి కొత్త అసెంబ్లీ ఏర్పడిన తర్వాతనే వచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే వచ్చే ఎన్నికల్లో వచ్చే ఫలితాలను బట్టి ఆ సీట్లు భర్త చేయాల్సి ఉంటుంది.

## అన్నదమ్ముల పొలిటికల్ వార్

శ్రీకాకుళం, జనవరి 9, ఏపీలో ఎన్నికలు దగ్గరలో ఉండడంతో అధికార పార్టీ వైసీపీ టికెట్లను ఎవరికి ఇవ్వాలి అన్న దాని మీద తీవ్ర కసరత్తు చేస్తోన్న సంగతి తెలిసింది. రాజకీయ నేతలు తమ వలసలను పెంచుకోవడంతో పాటు ప్రత్యర్థిని బలహీన పరచడానికి ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీకి చెక్ పెట్టేందుకు అధికార పార్టీ వైసీపీ వ్యూహానికి పదునుపెట్టింది. టీడీపీ సీనియర్ నేత అన్న అయ్యన్న పాత్రుడిపై పోటీకి తమ్ముడు సన్యాసిపాత్రుడిని రంగంలోకి దింపనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అన్నదమ్ముల పొలిటికల్ వార్ కు వేదిక కానుంది నర్సీపట్నం. 2019 ఎన్నికల అనంతరం వైసీపీలో చేరారు అయ్యన్న సోదరుడు చింతకాయల సన్యాసిపాత్రుడు. వచ్చే ఎన్నికల్లో అయ్యన్నను ఎదుర్కొనేందుకు సన్యాసిపాతృడే బలమైన అభ్యర్థిగా బావించిన జగన్..సిట్టింగ్ ఎమ్మెల్యే ఉమా శంకర గణేష్ ను పక్కన పెట్టాలని బావిస్తున్నట్లు తెలుస్తోంది.మూడో విడత జాబితాలో నర్సీపట్నం అసెంబ్లీ సెగ్మెంట్ ఇంచార్జి గా సన్యాసిపాత్రుడిని ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. టీడీపీ నేత అయ్యన్నకు తమ్ముడు సన్యాసిపాత్రుడు అయితేనే గట్టి పోటి అని అధిష్టానం భావిస్తుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే గణేష్ కు సౌమ్యుడిగా పేరు ఉన్నప్పట్టికి అయ్యన్నకు మాటకు మాట సమధానం చెప్పే కెపాసిటీ సన్యాసిపాత్రుడికి ఉందని అనుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో సన్యాసిపాత్రుడి భార్యకి డీసీసీబీ చైర్మన్ పదవి ఇచ్చింది వైసీపీ ప్రభుత్వం.ఎమ్మెల్యే గణేష్ టాలీవుడ్ సీనియర్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ స్వయనా తమ్ముడు. 2019 ఎన్నికల్లో టీడీపీ సీనియర్ నేత అయ్యన్నను ఓడించి ఎమ్మెల్యేగా గెలిచారు. మరి అలాంటి వ్యక్తిని ఇప్పుడు పక్కన పెట్టడం ప్రభుత్వానికి ప్లస్ అవుతుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎమ్మెల్యే గణేష్ ఇందుకు ఒప్పుకుంటారా? అనేది కూడా తేలాల్సి ఉంది. మరోవైపు ఎలాగైనా సిట్టింగ్ ఎమ్మెల్యే కు నచ్చ జెప్పి సన్యాసిపాత్రుడికి టికెట్ ఇచ్చే ప్లాన్ చేస్తున్నారు వైసీపీ పెద్దలు. చూడాలి మరి..టికెట్ అయ్యన్న తమ్ముడికి ఇస్తారా? లేదంటే నిర్ణయం మార్చుకుంటారా అనేది క్లారిటీ రావాలి.మాజీ మంత్రి అయ్యన్న మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై హాట్ కామెంట్స్ చేశారు. జగన్ బలవంతంగా అభ్యర్థులను మార్చుతున్నాడని.. చెత్త ఎక్కడున్నా చెత్తే అని విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే షర్మిల కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆమె వలన టీడీపీకి లాభం వైసీపీకి నష్టం అంటూ వ్యాఖ్యనించారు.10 శాతం ఓట్లు చీలినా వైసీపీ భూస్థాపితం అవుతుందని షాకింగ్ కామెంట్స్ చేశారు.

## టీడీపీ, జనసేన నేతల విబేధాలు

### గిద్దలూరులో నువ్వా నేనా

ఒంగోలు,ప్రకాశం జిల్లా గిద్దలూరులో టీడీపీ వైసీపీ మధ్య పచ్చగడ్డి వస్తే భగ్గుమంటుంది. ఇరు పార్టీల నేతలు ఒకరిపై మరోకరు విమర్శలు చేసుకుంటూ విబేధాలను తారా స్థాయికి తీసుకెల్తున్నారు. ఒకపక్క అధినేతలు ఇద్దరు కలిసి 2024లో అధికారంలోకి వచ్చేందుకు వ్యూహాలు పన్నుతుంటే.... గిద్దలూరులో మాత్రం ఇరు పార్టీల ఇంఛార్జీలు నువ్వా నేనా అంటూ మాటల యుద్ధం కొనసాగిస్తున్నారు. ఇక్కడ టీడీపీ ఇంచార్జీగా మాజీ ఎమ్మెల్యే ముత్తుముళ్ల అశోక్ రెడ్డి ఉన్నారు. ఈయన గత ఎన్నికల్లో గిద్దలూరు నుండి టీడీపీ తరుపున పోటీ చేసి వైసీపీ అభ్యర్ధి చేతిలో భారీ తేడాతో ఓటమి పాలయ్యారు. ఇక జేఎస్పీ ఇంఛార్జీ బెల్లంకొండ సాయిబాబు గత ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ కు జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం ఈయనను గిద్దలూరు జనసేన పార్టీ ఇంఛార్జీగా అధినేత పవన్ కళ్యాన్ నియమించారు. టీడీపీ, జేఎస్పీల మధ్య పొత్తు లేనంత వరకు ఈ ఇద్దరు ఇంఛార్జీలు ఎవరి పని వారు చేసుకుంటూ పోయారు. అయితే ఇటీవల ఇరుపార్టీల అధినేతలు రానున్న ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని ప్రకటించడంతో గిద్దలూరు లోని టీడీపీ, జనసేనలో విబేధాలు బయటపడుతున్నాయ్. ప్రకాశం జిల్లాలో జనసేన బలంగా ఉన్న నియోజికవర్గాల్లో గిద్దలూరు కూడా ఒకటి. అదే ఇప్పుడు అశోక్ రెడ్డి, సాయిబాబు మధ్య విభేదాలకు కారణంగా కనిపిస్తుంది. పొత్తులో భాగంగా జిల్లాలో దర్శి, గిద్దలూరు సీట్లు జేఎస్పీకు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది.

## విశ్వహిందూ పరిషత్ సమావేశ భవనానికి లక్ష విరాళం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 09 - పట్టణంలో విశ్వహిందూ పరిషత్ సమావేశ భవనానికి లక్ష రూపాయల విరాళాన్ని నంద్యాల బీజేపీ కన్వీనర్ అభిరుచి మదు అందించారు. మంగళవారం టెక్కే సమీపంలోని భరత మాత గుడి సమీపంలో నిర్మాణంలో ఉన్న విశ్వ హిందూ పరిషత్ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భవన నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందించారు. సమావేశ భవనం అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు .విశ్వహిందూ, బజరంగ దల్ అధ్వర్యంలో భవన నిర్మాణం చేపట్టారని తెలిపారు .తన వంతు సహాయంగా లక్ష రూపాయల నగదును విశ్వహిందూ,భజరంగ్ దళ్ సభ్యులకు అందజేశానని ఆయన అన్నారు .

## మున్సిపల్ కార్మికులు సమ్మెకు.సిపిఐ మద్దతు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 09-మున్సిపల్ పారిశుద్ధ్య కాంటాక్ట్ కార్మికులు ఏడవ రోజు నిర్వహిస్తున్న జైల్ బరో కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి సుంకయ్య సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోట రాముడు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు మహానంది సిపిఐ నాయకులు సామెల్ మద్దతు తెలిపారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ ఇప్పటికి ఏడు రోజుల నుండి మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె నిర్వహిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చలనం లేదని అన్నారు. కార్మికుల ఓట్లతో అధికారం లేకొచ్చి ఇప్పుడు కార్మికులను విస్మరించడం మంచిది కాదని అన్నారు. గతంలో పాదయాత్రలో అధికారంలో లేనప్పుడు టిడిపి ప్రభుత్వం పై విరుచుకుపడి మున్సిపల్ కార్మికులకు ఎంత ఇచ్చిన తక్కువ అని వాళ్ళని వెంటనే పర్మినెంట్ చేయాలని నేను అధికారంలోకి వచ్చిన వెంటనే పర్మిట్ చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు పర్మినెంట్ కాదు కదా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వమంటే కూడా జగన్మోహన్ రెడ్డికి చేతులు రావడంలేదని అన్నారు. ఏడవ రోజు మున్సిపల్ కార్మికులు ఎమ్మార్వో కార్యాలయం దగ్గర నిర్వహిస్తున్న జైల్ బరో కార్యక్రమానికి మద్దతు తెలిపి ప్రత్యక్షంగా పాల్గొనడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి శ్రీనివాసులు, భూమన శ్రీనివాసులు మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు రంజిత్ ప్రతాప్ ఓబులేష్ శివ రాముడు మద్దయ్య మద్దిలేటి తోపాటు మున్సిపల్ పారిశుద్ధ కాంటాడు కార్మికులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమా



శ్రీ సత్య సాయి కొత్తచెరువు జనవరి 9 ) మండల కేంద్రమైన కొత్తచెరువు గ్రంథాలయాన్ని మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాల యంలోని రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయములోని పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయా లేదా అని పాఠకులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాల కొచ్చే పాఠకులకు పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, గ్రంథాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జయరామ్ కు సూచించారు. అలాగే పంచాయతీల నుండి రావలసిన గ్రంథాలయ పన్నులు సకాలంలో అందించాలని సంబంధిత పంచాయతీ అధికారులను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయరాం, సాలెం రాజు, ఆంజనేయులు, పాఠకులు మునీర్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర వస్తువుల పంపిణీని వేగవంతం చేయండి

## జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి



-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 09 - రానున్న సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులు పెండింగ్ లేకుండా కార్డుదారులకు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సివిల్ సప్లైస్ డిప్యూటీ తాసిల్దార్లను ఆదేశించారు. మంగళవారం జేసీ చాంబర్ లో రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, అసైన్డ్ భూముల విచారణ తదితర అంశాలపై మండల తాసిల్దారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న భూహక్కు - భూ రక్ష పథకం కింద రీ సర్వే చేపట్టిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రీసెర్వే ప్రక్రియకు సంబంధించి అన్ని పనులు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం రీ సర్వే జరుగుతున్న 15 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ ఈనెల 12వతేదీ లోపు పూర్తి కావాలన్నారు. వీఆర్వో, తాసిల్దార్, ఆర్డీఓ లాగిన్ లలో ఉన్న ఇనాం భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి పెండింగ్లో ఉన్న అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పనుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ అవుతున్న నిత్యావసర వస్తువుల విధానాన్ని డిప్యూటీ తాసిల్దార్లు తనిఖీలు నిర్వహించి సంక్రాంతి పండగ లోపు అన్ని వస్తువులు కార్డుదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని జెసి ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎస్ఓ వెంకటరాముడు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు ఈకేవైసీ తప్పకుండా చేయించు కోవాలి

## మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఇర్ల ప్రసాద్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 09- నంద్యాల మండలం పులిమద్ధి గ్రామం లో సర్పంచు రఘురామిరెడ్డి , భీమవరం గ్రామంలో సర్పంచు శ్రీమతి భక్త వత్సలమ్మ అధ్యక్షతన రైతు భరోసా కేంద్రాల యందు మండల వ్యవసాయాధికారి ఇర్ల ప్రసాదా రావు ఈ క్రాపు నమోదు ఈ కేవైసీ తప్ప కుండా చేయించు కోవాలని రైతులకు సూచించారు. అలాగే జొన్న పంట కొనుగోలు పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతు సోదరులు రబి సీజన్లో 9000 ఎకరాలలో రైతులు పంటలు సాగు చేశారని, 5800 ఏకరలు ఈ క్రాపు నమోదు చేయడం జరిగిందన్నారు ,మిగిలిన రైతులు కూడా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి నమోదు చేయించుకొని ఈ కేవైసీ చేయించుకుంటే ప్రభుత్వం నుంచీ వచ్చు పంటల భీమ, పంటల నష్ట పరిహారం, సున్న వడ్డీ రాయితీ మరియు కనీస మద్దతు ధరకి రైతులు అమ్ముకోవడం జరుగుతుందన్నారు , పంట సాగు చేసిన ప్రతి రైతు సోదరుడు పంటను నమోదు చేసుకొని వేలిముద్ర రైతు భరోసా కేంద్రం నందు వేయవల్సింది గా నంద్యాల మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు .అలాగే త్వరలో జొన్న పంటను సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాలలో కనీస మద్దతు ధర ఒక క్వింటాలకి 3180 రూపాయలతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు , ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. ఈ కార్యక్రమం లో ఎఈఓ లు మని మోహన్ రెడ్డి , మనోహర్,గ్రామ సహాయకులు సురేష్,కావ్య ఇరు గ్రామాల రైతులు పాల్గొన్నారు

# మున్సిపల్ కార్మికులకు పంగనామాలు పెట్టిన ముఖ్యమంత్రి...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 9 డోన్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె 14వ రోజు మంగళవారం కొనసాగింది.స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని దీక్షా శిబిరంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నుదుటిపై పంగనామాలు పెట్టుకొని వినూత్న రీతిలో ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,పట్టణ అధ్యక్షులు నక్కిశ్రీకాంత్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప,ఉపాధ్యక్షులు పెద్ద ఎల్లయ్యలు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని 15 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడం లేదని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్రలోనూ, ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీ లోను మాటలతో, పొగడ్తలతో,హామీలతో వరాల జల్లు కురిపించారని మున్సిపల్ కార్మికులు చేసే పని కన్న తల్లి కూడా చేయదని,వారు దేవుళ్లతో సమానమని వారి కాళ్లకు మొక్కిన తప్పు లేదని, వారికి లక్ష రూపాయల వేతనం ఇచ్చినా తక్కువేనని కావున 6 నెలలలో మున్సిపల్ కార్మికులను అందరినీ పర్మినెంట్ చేస్తానని, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచుతానని చెప్పారన్నారు. కానీ ఆయన అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా సమస్యలు పరిష్కరించలేదని ఈ నాలుగున్నర సంవత్సరాలు అనేక రకాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని చివరికి విధి లేని పరిస్థితులలో నిరవధిక సమ్మెకు వెళ్లవలసి వచ్చింది అన్నారు. 15 రోజులుగా సమ్మె జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని జగన్మోహన్ రెడ్డి ఉత్తుత్తి మాటలతో పొగడ్తలతో మున్సిపల్ కార్మికులకు పంగనామాలు పెట్టాడని అర్థం అవుతున్నదని అందుకే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పంగనామాలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించి సమ్మెను సామరస్యంగా పరిష్కరించాలని లేనియెడల రాబోవు ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డికి పంగనామాలు పెట్టడానికి మున్సిపల్ కార్మికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి అక్బర్ బాషా, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్క హరి పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యేసు, హైమ రావు, ఆవులయ్య,సురేష్,రామాంజి, రంగనాయకులమ్మ,వెంకట లక్ష్మమ్మ,అంజనమ్మ,లలితమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం సంక్షేమ పథకాలు ... ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 09 నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ బొగ్గు లైన్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ . ప్రతి నెలా ఒకటో తారీఖునే ఠంచనుగా ఉదయమే పెన్షన్ ఇచ్చి, మనవడిలా సీఎం వైఎస్ జగన్ ఆదుకుంటున్నారని అన్నారు.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపగలిగామని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల కష్టాలను గుర్తించడం వల్ల ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ఆధార భిమానాలు పొందుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మభూన్నిసా. కమిషనర్ రవి చంద్రా రెడ్డి. అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. , రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, , ఎమ్మార్వో శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, సచివాలయాల కన్వీనర్ దల్ మిల్ అమీర్ ,మాజీ కౌన్సిలర్ అనిల్ అమృతరాజు 29వ వార్డు ఇన్చార్జి జలీల్ భాషా, వార్డు వైసీపీ నాయకులు సచివాలయ సిబ్బంది వార్డు వాలంటరీలు పాల్గొన్నారు.

## కోసిగి తెలుగు తమ్ముళ్ల లో జోష్ నింపిన భువనేశ్వరి పర్యటన



కోసిగి,జనవరి 09 (విభారె న్యూస్) తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు సతీమణి, నటసార్వ భౌమా స్వర్గీయ తారక రామారావు కుమార్తె నారా భువనేశ్వరి ఓదార్పు యాత్ర లో భాగంగా కోసిగి మీదుగా వెళ్లడం జరిగింది. దీంతో కోసిగి తెలుగు తమ్ముళ్లలో జోష్ పెరిగింది. భువనేశ్వరి ఓదార్పు యాత్రలో భాగంగా మంగళవారం నాడు పెద్ద కడబుర్ మండలం నుండి కౌతాళం మండలం వల్లూరు కి కోసిగి మీదుగా వెళు తున్నట్లు తెలుసుకొని తెలుగు తమ్ముళ్లు వేలాదిగా వైస్సార్ సర్కిల్ కు చేరున్నారు. అయితే భువనేశ్వరి అటుగా వెళుతూ కోసిగి వైస్సార్ సర్కిల్ ల్లో కిందకు దిగి కొద్ది సేపు మాత్రమే ఉంటూ చిరునవ్వు తో కార్యకర్తలకు అభివాదం చేస్తు కారు ఎక్కి వెళ్లిపోవడం జరిగింది. ఉదయం నుండే తెలుగు తమ్ముళు ,, ఎన్టీఆర్ అభిమానులు, మహిళలు పెద్దయెత్తున్న వైస్సార్ సర్కిల్ కు చేరుకొని భువనేశ్వరి స్వాగతం పలుకుతూ చూసేందుకు ఎగబడ్డారు. పలువురు పూల మాలలు వేయడానికి ప్రయత్నించారు. సెక్యురిటీ ప్రాబ్లమ్ వల్ల చూసేందుకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మున్సిపల్ ఇంజనీరింగ్ మరియు పారిశుద్ధ్య కార్మికులకు మద్దతు తెలిపిన బాలయ్య

హిందూపురం జనవరి 9 )హిందూపురం పురపాలక సంఘం కార్యాలయం ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ మరియు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె ఏడవ రోజున హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ సమ్మె శిబిరానికి వచ్చి మద్దతు తెలిపారు. హిందూపురం శాసనసభ్యులు ఎమ్మెల్యే అయినా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ మరియు శానిటేషన్ కార్మికులకు వేతనాలను పెంచాలని, ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని, పట్టణాభివృద్ధికి ఫ్రెంట్ లైన్ వారియర్స్ లాగా నిలిచే కార్మికులకు అన్యాయం చేయకుండా వారికి సమాన పనికి సమాన వేతనం సుప్రీంకోర్టు ఆర్డర్స్ ప్రకారం కార్మికుల కోరుకున్నట్టు 26 వేల రూపాయలు జీతం ఇవ్వాలని, ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని తెలపడం జరిగినది. దీక్షా శిబిరంలో ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు, శానిటేషన్ సెక్షన్ కార్మికులు ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ఈకార్యక్రమంలో ఏఐటియుసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్, జిల్లా కోశాధికారి బాబు, పట్టణ అధ్యక్షులు జబీ ఉల్లా, పట్టణ కార్యదర్శి మారుతి రెడ్డి, సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అఖిల్ రాజ్, కార్యదర్శి హృదయెశ్వర్, ఉపాధ్యక్షులు రంజాని,నరేష్, వరదరాజులు శ్రీనివాసులు ఐనార్, సహాయ కార్యదర్శులు సుబ్రమణ్యం, కార్యదర్శి సురేష్ లక్ష్మీదేవి సిద్ధమ్మ అంజి వినోద్ వెంకటేష్ పాల్గొన్నారు. ఏఐటియుసి శ్రీ కాట్ మిల్ నాయుకులు అలీమ్,నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, మురళి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు పక్రుద్దీన్, తదితరులు మద్దతు తెలిపారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190